ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
గురువారం 1 ఫిబ్రవరి 2024









ఎన్నికల ముంగిట మోదీ సర్కార్ వరాలు కురిపిస్తుందా ? కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టబోయే మధ్యంతర బడ్జెట్‌లో షాకులుంటాయా ? అందరూ ఊహించినట్టు ఎన్నికల షో..కులంటాయా.. ? అనే ప్రశ్నలు అందరి మదిలోనూ కదలాడుతున్నాయి..? ఏం చేస్తారో చూడాలి.

షాకులా.. ఎన్నికల షోకులా ?

- నేడు పార్లమెంటులో కేంద్ర మధ్యంతర బడ్జెట్
- పోలవరం సహా ఇతర ప్రాజెక్టులకు ప్రాధాన్యత దక్కేనా ?
- వేతన జీవుల కలలు నెరబోతున్నాయా ?
- రైతులకు మద్దతుగా నిలిచేనా ? నట్టేట ముంచేనా ?
- ఎన్నికల ముందు ఎడాపెడా వరాలు కురుస్తాయా ?
- అందరిచూపు నిర్మలమ్మ బడ్జెట్‌పైనే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడ్డాయి. మరికొద్ది రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతుంది. రాజకీయ పక్షాలన్నీ అభ్యర్థుల వేటలో, సర్వేల జాతరలో మునిగి తేలుతున్నాయి. జనం కూడా రాబోయే ఎన్నికల సరళిపై ఉత్కంఠతో ఉన్నారు. గడిచిన ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విసిరిన వరాలు, అనుసరించిన వ్యతిరేకత మధ్య బేరీజు వేసుకునే పనిలో పడ్డారు. ఈ తరుణంలోనే గురువారం పార్లమెంటులో కేంద్ర మధ్యంతర వార్షిక బడ్జెట్‌ను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టబోతున్నారు. వాస్తవానికి ప్రతీసారి పూర్తి బడ్జెట్ ప్రవేశపెడుతుండగా, ఈసారి మధ్యంతర బడ్జెట్‌ను ప్రజల ముందుంచబోతున్నారు. గత వార్షిక బడ్జెట్‌లకు, ఈసారి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌కు మధ్య భారీ వ్యత్యాసం ఉండబోతుంది. వీలైనంత మేర ప్రజాకర్షక బాణాలు వదలబోతున్నారని కొందరు, అవేవీ లేకుండానే ఉత్తుత్తి అంకెలతో సరిపెట్టబోతున్నారని ఇంకొందరు అంచనాలు వేస్తున్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు గడిచిన ఐదేళ్లుగా పూర్తిగా మూలనపడింది. ఈ ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ, నిధుల కేటాయింపు బాధ్యతను భుజానకెత్తుకున్న కేంద్రం ఆ మేరకు కేంద్ర వార్షిక బడ్జెట్‌ల్లో ఏనాడు సానుకూలత ప్రదర్శించలేదు. ఈసారి ప్రాజెక్టును కనికరిస్తారా లేదా అనేది చూడాలి. ఎన్నికల సమయం కాబట్టి అందరినీ ప్రసన్నం చేసుకోవడానికి వీలుగానే కేంద్రం వరం ఇవ్వబోతుందా, లేకుంటే సైలెంట్‌గా మిగిలిపోతుందా..? అనేది రైతులందరిలో కనిపిస్తున్న ఉత్సుకత. జల్‌మిషన్ కింద తాగు నీటి సరఫరా, ఇంటింటికీ కుళాయి పేరిట పథకాలకు మోక్షం కల్పిస్తారా లేక గొంతెండేలా నినదించాలా అనే అనుమానం లేకపోలేదు. ప్రత్యేకించి కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఏ అంకెల గారెడీ చేయబోతున్నారనేదే ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న.

వేతన జీవుల మాటేంటి



దీర్ఘకాలికంగా భారతీయ జనతా పార్టీ కేంద్రంలో పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి వార్షిక ఆదాయం రూ.రెండున్నర లక్షల వరకు పెంచుతారని ఊహిస్తూ వచ్చారు. కాని ఏయేటి కాయేడు నిర్మలమ్మ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆదాయపు పన్ను పరిమితి విషయంలో లక్షలాది మంది ఎదురుచూసే అంశం లోనూ కేంద్రం దోబూచు లాడుతూ వచ్చింది. ఈసారైనా పన్ను మినహాయింపులో వరాలు ఏమైనా ప్రకటిస్తారా, లేదా అనేది తేలిపోనుంది. సాధారణంగా మధ్యంతర బడ్జెట్‌ల్లో కీలక నిర్ణయాలకు వీలుగా పరిస్థితులు ఉండవని, అయితే ఎన్నికలు దగ్గరపడుతున్నాయి కాబట్టి వేతన జీవులను ఆకర్షించేం దుకు ఆదాయ పరిమితిలో కొత్త నిర్ణయాలు ప్రకటిస్తారనే ఆశతో ఉన్నారు. రైతుల విషయంలోనూ ఏమైనా ఆకర్షణీయ పథకాలకు శ్రీకారం చుడతారని భావిస్తున్నారు. ఇప్పటికే ఎరువులు, పురుగు మందు ధరల్లో కొంత తగ్గుదల కనిపించినా వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా పంటల బీమా, ఇతరత్ర అనుకూల పథ కాలు పూర్తిగా వర్తించడమేలేదు. రైతులను సంతృప్తిపర్చడం లేదు. దీంతో రైతాంగంలో కాస్తంత అసంతృప్తి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీనికి విరుగుడుగా రైతులకు కలిసొచ్చేటట్టుగా ఎన్నికల ఎత్తులు నిర్మలమ్మ బడ్జెట్‌లో కనిపిస్తాయన్న ఆశతో మరికొందరు ఉన్నారు.

ఆక్వా రంగం ఈవైపే..



చాన్నాళ్లుగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగంలో విదేశీ వాణిజ్యం వైపు ఏమైనా కొత్త చమక్‌లు ఉండబోతున్నాయా ? అనే ఆశతో వేలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. ఆక్వా ఎగుమతులపై చాన్నాళ్లుగా ఒడిదుడుకులతో ఆక్వా రైతులు నష్టం చవిచూస్తున్నారు. ప్రత్యేకించి విదేశీ మార్కెట్‌లో మన రొయ్యల ఉత్పత్తులు మార్కెట్ సజావుగా సాగేలా కేంద్రం నిర్ణయాత్మక చర్యలేవీ తీసుకోలేదు. బడ్జెట్‌లోను ఆ మేరకు సంకేతాలు ఇవ్వలేదు. ఈసారైనా ఆక్వా రంగానికి కాస్తంత ఆక్సిజన్ ఇచ్చేలా నిర్ణయాలు ఉంటాయా, లేవా అనేది ఇప్పటికైతే సస్పెన్సే.

బడ్జెట్‌లో షాకులుంటాయా..

ఎన్నికల ముంగిట్లో కొన్నింటిపై మినహాయింపులు, మరికొన్నింటిపై ఒడ్డింపులు ఉండే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. విద్యా రంగంలో గతంలో ఉత్తమ సంస్కరణలు అమలుచేసే వీలుగా అనేక కీలక అంశాలతోపాటు నిధులు కేటాయించే వారు. రానురాను ఈ తరహా వాటాలు తగ్గిస్తూ వచ్చారు. వైద్య, ఆరోగ్య రంగాల్లోను వరాలిచ్చే ప్రక్రియ సాగిస్తారా, పెట్రోలుతోపాటు ఇతరత్ర వస్తువులపైన ఒడ్డింపులు వేసి షాకులిస్తారా అనేది నేడు తేలబోతుంది.



కార్యకర్తలతో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

5న చింతలపూడిలో 'రా.. కదలిరా' సభ

చింతలపూడి, జనవరి 31 : ఫిబ్రవరి 5వ తేదీన చింతలపూడిలో జరిగే రా.. కదలిరా బహిరంగ సభను జయప్రదం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. స్థానిక నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్న పార్టీ రానున్న ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. ఏలూరు పార్లమెంటులోని ఏడు నియోజక వర్గాల నుంచి ఈ సభకు భారీగా పార్టీ శ్రేణులు తరలివచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే స్థలాన్ని, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. సమావేశంలో ఆయన వెంట టీడీపీ నాయకులు, మాజీ మంత్రి మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీరామకృష్ణ, జోన్-2 నాయకులు మందలపు రవి, నియోజకవర్గ పరిశీలకులు కోళ్ళ నాగేశ్వరరావు, ఆకుమర్తి రామారావు, బొరగం శ్రీనివాస్, జగ్గవరపు ముత్తారెడ్డి, బొమ్మాజీ అనిల్, రోషన్‌కుమార్, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్ష శిబిరం వద్దే నిద్రిస్తున్న మాతృభాషా వలంటీర్లు

సడలని దీక్ష..

బుట్టాయగూడెం, జనవరి 31 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న మాతృభాషా వలంటీర్లు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు దీక్షా శిబిరంలోనే పడుకుని నిరసన తెలిపారు. వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మాతృభాషా వలంటీర్లు పలు దఫాలుగా దీక్షలు, నిరసనలు తెలిపారు. అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఆగ్రహించిన వలంటీర్లు రాత్రంతా కటిక చలిలో శిబిరంలోనే పడుకుని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు శిబిరం వద్దకు చేరుకుని శిబిరాన్ని ఖాళీచేసి వెళ్లిపోవాలని హెచ్చరించినా తెల్లారేవరకు నిరసన కొనసాగించారు. బుధవారం బీజేపీ నాయకులు వలంటీర్లకు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కారించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌పై
ఎన్నికల అధికారి విచారణ

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 31 : తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌పై ఎన్నికల అధికారి దుర్గేష్ బుధవారం విచారణ నిర్వహించినట్లు సమాచారం. తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ సాగినట్లు తెలిసింది. కమీషనర్ శామ్యూల్ తాడేపల్లిగూడెంలోనే సొంత నివాసం ఉందని, దాంతో పాటు పలు అభియోగాలను మోపుతూ తెలుగుదేశం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. అందుకు సంబంధించిన పలు ధ్రువీకరణ పత్రాలు సమర్పించింది.ఆయన తాడేపల్లిగూడెం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉంటే ఎన్నికల్లో తమకు ఇబ్బంది ఉంటుందంటూ ఫిర్యాదులో పేర్కొంది. టీడీపీ ఇచ్చిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం స్పందించి విచారణ చేపట్టినట్లు తెలిసింది.

వారధి టెండర్లు మళ్లీ వాయిదా

నరసాపురం, జనవరి 31: వశిష్ట వారధి టెండర్లు మళ్లీ వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం బుధవారం టెండర్లు తెరవాల్సి ఉంది. అయితే అధికారులు వాయిదా వేశారు. దీంతో ఇప్పటి వరకూ ఐదు సార్లు వాయిదాపడినట్టు అయ్యింది. మళ్ళీ ఫిబ్రవరిలో టెండర్లు తెరవనున్నట్టు సమాచారం. ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ సుమారు రూ.490 కోట్లతో చేపట్టే ఈ పనులకు గతేడాది ఆగస్టు నెలలో టెండర్లు పిలిచారు. డిసెంబర్‌లో వాటిని తెరవాల్సి ఉంది. అయితే భూసేకరణకు సంబంధించి కోనసీమ జిల్లాకు చెందిన కొందరు రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి కేసు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో టెండర్లు వాయిదాపడుతున్నట్టు తెలియవచ్చింది. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం భూసేకరణకు సంబంధించి రూ.60 కోట్లు నిధులు విడుదల చేసింది. నరసాపురం మండలం రాజుల్లంక నుంచి సీతారామపురం వరకూ సాగే ఈ రోడ్డు పనులకు 52 ఎకరాలు సేకరించారు. ఇప్పటికే కొంతమంది రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అయ్యింది. మళ్ళీ ఫిబ్రవరిలోనైనా టెండర్లు ఓకే అవుతాయా లేదా పెండింగ్ పడతాయా అనేది చర్చనీయాంశంగా మారింది.

నేడు పురందేశ్వరి రాక
భీమవరంలో ఎన్నికల కార్యాలయం ప్రారంభం

భీమవరం జనవరి 31 : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గురువారం భీమవరం రానున్నారు. నరసయ్య అగ్రహారంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభి స్తారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ బుధవారం తెలిపారు. దీంతో పాటు రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ కేంద్రాల్లో ఉన్న ఎన్నికల కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 9-30 గంటలకు ఎస్‌ఆర్‌కెఆర్ కాలేజీ నుంచి బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఎన్నికల కార్యాలయం ప్రారంభం తర్వాత క్యాంపస్‌లోనే బహిరంగ సభ జరుగుతుందని, అనంతరం జిల్లా కార్యవర్గ సమావేశం జరుగుతుందని తెలిపారు.



మట్టి తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ‌ఈ, జనసేన శ్రేణులు

మట్టి తవ్వకాలు అడ్డుకున్న టీడీపీ, జనసేన

ఆచంట, జనవరి 31: ఆచంట మండలం లంకగ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న మట్టి, ఇసుక తవ్వకాలను బుధవారం జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు అడ్డుకున్నారు. పెదమల్లం లంకలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను, వాహనాలను అడ్డుకున్నారు. సురేష్‌బాబు మాట్లాడుతూ లంక గ్రామాల్లో మట్టి, ఇసుక పెద్ద ఎత్తున తరలిపోతున్నా అధికారులు మాత్రం జిల్లా సరిహద్దు తమది కాదంటూ పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే యథేచ్ఛగా మట్టి తరలిపోతోందని ఆరోపించారు.ఎంపీటీసీ ప్రసాదబాబు, అల్లం సూర్య ప్రకాష్, గుబ్బల మాధవరావు, మన్నె రమేష్, కనపాల వెంకటేశ్వరరావు, ఉంగరాల లక్ష్మణ్, బాలం వెంకటరమణ, కేతా మురళి ఉన్నారు.



రెచ్చిపోయిన మట్టి మాఫియా

అడ్డుకున్న టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకల దాడి

- మెయిన్‌లో

హెల్త్ సెక్రటరీల ఆవేదన.. అదనపు డీఎంహెచ్‌వోకు వినతి



భీమవరం జనవరి 31 : హెల్త్ సెక్రటరీలకు విధి నిర్వహణలో మోయలేని అదనపు పని భారాన్ని అప్పగించారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం కలెక్టరేట్లోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుని అదనపు డీఎంహెచ్‌వో భాను నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 2019 నుంచి సచివాలయాలు ఏర్పడి నప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వర్క్స్ అన్నీ కూడా విలేజ్ హెల్త్ సెక్రటరీలే చేస్తున్నారని అంతేకాకుండా 2015 నుంచి పెండింగ్లో ఉన్న వర్కులు తమతోనే చేయించారని, ఇప్పటి వరకు దానికి సంబంధించి ఒక రూపాయి కూడా ఇన్సెంటివ్ చెల్లించ లేదని వాపోతున్నారు. కానీ కొత్తగా వచ్చిన ఎంఎల్‌హెచ్‌పీలకు రు.7,500 ఇన్సెంటివ్ ఇచ్చారని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

13 నెలలుగా జీతాల్లేవు

ఔట్‌సోర్సింగ్ లస్కర్ల అవస్థలు
నీటి సంఘాల నిధులతో వేతనాలకు ముడి
పశ్చిమ డెల్టాలో 250కి పైగా సిబ్బంది కష్టాలు

భీమవరం, జనవరి 31 : జలవనరుల శాఖలో విధులు నిర్వహించే అవుట్ సోర్సింగ్ లస్కర్లకు 13 నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నారు. ఏప్రిల్ నెల నుంచి మార్చి వరకు ఏడాదిలో పదినెలల పాటు నెలకు 10,500 చెల్లించేలా ఔట్ సోర్సింగ్ విధానంలో వీరిని విధుల్లోకి తీసుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అధికార పార్టీల నాయకుల సిఫార్సులతో వీరిని విధుల్లోకి తీసుకున్నారు. గోదావరి డెల్టా పరిధిలో 600 మందిని తీసుకోగా జిల్లా పరిధిలో ఆయకట్టులో 250 మంది సిబ్బంది ఉన్నారు. వీరికి ఏడాది వేతనంతో పాటు గతేడాది 3 నెలలు వేతనం పెండింగ్‌లో ఉంది.మార్చి నెల వస్తే 15 నెలలు అవతుందని వారంతా వాపోతున్నారు. సాగునీటి సంఘాలకు కేటాయించే బడ్జెట్ నుంచి ఆ సంఘ కమిటీలు 10 శాతం నిధులను ఖర్చుల కింద వాడుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ నిధులనే వీరికి ఒప్పందం మేరకు చెల్లిస్తూ ఉంటారు. నెలకు వీరికి ఇచ్చే రూ.10,500 వర్క్ విభాగంలో మాత్రమే చెల్లించే విధంగా ఒప్పందం ఉంది. జలవనరుల శాఖలో పర్మినెంట్ లస్కర్లు పదవీ విరమణ చేసిన తరువాత ఖాళీలను రిటైర్ అయిన లస్కర్ల ఇష్టాల మేరకు వారినే అవుట్ సోర్సింగ్‌లో నియమించుకోవచ్చుని ఉత్తర్వులు ఉన్నాయి. అయితే కొంతమంది అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సిఫార్సులతో ఆయా ఖాళీలను భర్తీ చెయ్యడంతో రిటైర్డ్ ఉద్యోగులకు అవకాశం లేకుండా పోయింది.

నీటి సంఘాలకే దిక్కులేదు

ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటి సంఘాలను పక్కన పెట్టేశారు. కమిటీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు లేకుండా పోయింది. ఏటా సుమారు 10 నుంచి 12 కోట్ల రూపాయలతో ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ ప్యాకేజీలో మురుగు కాల్వల్లో తూడు, చెత్త తొలగింపు చేస్తూ ఉండేవారు. నాలుగేళ్లుగా టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేకపోవటంతో రెండు మూడు కోట్లతో ఖరారైన పనులను ముక్కుబడిగా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ విభాగంపై ఆధారపడిన అవుట్ సోర్సింగ్ వేతన జీవులకు ఒప్పందం ప్రకారం పనులకు వేతనం ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వేతనాల కోసం జలవనరుల శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబాల పరిస్థితి చాలా దారుణంగా మారిందని, అప్పు కూడా పుట్టడం లేదని అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్ సమయంలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున 15 నెలల వేతనం వచ్చే పరిస్థితి ఉందో లేదో అనే ఆవేదన వ్యక్తం అవుతోంది.



న్యాయం చెయ్యాలి

అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న లస్కర్లకు అధికారులు న్యాయం చెయ్యాలి. ఇప్పటికే 13 నెలలుగా వారు వేతనాలు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. వారి కుటుంబాలు దీనావస్థలో ఉన్నాయి. అధికారులు వారి దుస్థితిని అర్థం చేసుకుని బకాయిలు చెల్లించాలి.

-విక్రమ్, ఆంధ్రప్రదేశ్ లస్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు అందుకుంటున్న నన్నయ విద్యార్థులు



వీసీ, అతిథులతో జేఎన్‌టీయూ పీహెచ్‌డీ గ్రహీతలు

ప్రజల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్
ఘనంగా జేఎన్టీయూకే ,నన్నయ వర్సిటీ స్నాతకోత్సవాలు

కాకినాడ/రాజమహేంద్రవరం, జనవరి 31: ప్రజల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గవర్నర్, జేఎన్‌టీయూకే కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో కాకినాడ జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు గవర్నర్ అధ్యక్షతన ప్రారంభించారు. మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్య అతిథిగా విచ్చేశారు. టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. జేఎన్టీయూకే ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీఎస్సీహెచ్‌ఈ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఈసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ వేదికను అలంకరించారు. గవర్నర్ నజీర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద మాటలను గుర్తుచేశారు. ఒక ఆలోచనను స్వీకరించి దాన్ని తమ జీవితంగా చేసుకోవాలని దాని గురించే ఎల్లపుడూ ఆలోచిస్తూ కలలు కంటూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. తమను తాము విశ్వసించాలని, తమ జ్ఞానం సామర్థ్యాలపై అత్యంత విశ్వాసం చూపాలని సూచించారు. ముఖ్య అతిథి వెంకటశేషాచారి మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించే పరిశ్రమలకోసం పరిశోధనాభివృద్ధి ప్రాజెక్టులను ప్రోత్సహించాలని కోరారు. 64 మందికి పీహెచ్‌డీ అవార్డులు, 21 మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు.

నన్నయ స్నాతకోత్సవం ..

ఉన్నత విద్యలో 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తిని 50 శాతం పెంచడమే జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యమని గవర్నర్, నన్నయ విశ్వ విద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13,14,15 ఉమ్మడి స్నాతకోత్సవం బుధవారం వర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం జరిగింది. గవర్నర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 900 విశ్వ విద్యాలయాలు, 40 వేల కళాశాలలతో ఉన్నత విద్యావిధానంలో భారతదేశం అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. కానీ ఉన్నత విద్య స్థూల నిష్పత్తిలో మన దేశం కేవలం 27.29 శాతం మాత్రమే ఉందన్నారు. రానున్న 15 ఏళ్లలో ఉన్నత విద్యలో అరుదైన భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు ముందుకెళుతున్నాయన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తి మాట్లాడుతూ మాతృభాషను తప్పక గౌరవించాలని, అలాగే సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. విశ్వంలో ప్రతీ జీవరాశి పట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలని కోరారు.

పలువురికి డాక్టరేట్‌లు

ఇన్ఫోసిస్ చైర్‌పర్సన్ సుధామూర్తికి గౌరవ డాక్టరేట్‌ను, రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతికి డి.లిట్‌ను, ఎంఏ సోషల్ వర్క్‌లో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఎండోమెంట్ గోల్డ్ మెడల్‌ను 2021కి గానూ జక్కంపూడి విజయలక్ష్మికి ప్రదానం చేశారు. అలాగే టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌కు గవర్నర్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేశారు.



ప్రధానిమంత్రి అవార్డుల కోసం నామినేషన్లు సమర్పించండి : కలెక్టర్

భీమవరం, జనవరి 31 : కేంద్ర పథకాల అమలును వినూత్నంగా చేపట్టిన జిల్లాలోని ప్రభుత్వ శాఖలు ప్రధానమంత్రి అవార్డుల నామినేషన్లకు సమాచారాన్ని సమర్పించాలని కలెక్టర్ ప్రశాంతి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం కలెక్టరు సమీ క్షించారు. పరిపాలనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించేందుకు ది ప్రైమ్ మినిస్టర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నామినేషన్లు కోరిందన్నారు. 2023 సంవత్సరానికి పథకాల అమలులో పౌర సేవకుల సహకారాన్ని గుర్తించి అవార్డులకు ఎంపిక చేస్తారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, మిషన్ ఇంద్ర ధనుష్, ప్రధాన మంత్రి - విజన్ ఆరోగ్య యోజన, ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, విశ్వకర్మ యోజన, ముద్రా రుణాలు వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వీడియో క్లిప్స్ తదితర డాక్యు మెంట్లతో సమాచారాన్ని నామినేషన్ల కోసం సమర్పించాలని సూచించారు. సీపీవో కె.శ్రీనివాస రావు, డీఈవో వెంకటరమణ, స్కిల్ డెవలప్మెంట్ అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా ఉదయభాస్కర్

భీమవరం, జనవరి 31 : పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా ఉదయ భాస్కర్ బదిలీపై రానున్నారు. ప్రస్తుతం డీఆర్వోగా ఉన్న శివన్నారాయణ రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.. దీంతో ఆ పోస్టును భర్తీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఆధునిక సాగు అదుర్స్!

తగ్గుతున్న పెట్టుబడి.. సమయం ఆదా
కూలీల కొరత తీరుస్తున్న వైనం
పొగాకు, మిర్చిపై అన్నదాతల మొగ్గు



మొగల్తూరులో పాఠశాలకు తాళం



వైద్యం వికటించి చిన్నారి మృతి

7

కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేస్తే ఊరుకోం


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తణుకు, జనవరి 31: కల్లుగీత వృత్తిని నిర్వీర్యంచేయాలని చూస్తే వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహా సభల్లో ఆయనమాట్లాడుతూ, మద్యపానం నిషేధించలేని ప్రభుత్వం, కల్లుగీతను నిషేధిస్తామనడం హాస్యాస్పదమన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 200 మంది గీత కార్మికులు మృతిచెందినా రూ.రెండు లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాల్సి ఉండగా ఏ ఒక్కరికి రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఐక్యతను దెబ్బతీసే కార్పొరేషన్‌ల వల్ల ఒరిగిందేమి లేదని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ అన్నారు. ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏంటో చూపిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేవముడు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, బాస్కరయ్య, చంద్రప్రసాదు, మట్టా వెంకట్, పీవీ ప్రతాప్, కేతా గోపాలన్ పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కన్వర్టెడ్ క్రిస్టియన్స్

కులగణనలో కన్వర్టెడ్ క్రిస్టియన్లకు అన్యాయం

కాళ్ళ, జనవరి 31 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేలో కన్వర్టెడ్ క్రిస్టియన్లకు అన్యాయం జరుగుతుందని ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రేడ్ (ఎఫ్ఎఫ్‌సీఐ) రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. ఇస్మాయేల్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం కన్వర్టెడ్ క్రిస్టియన్స్ ఆందోళన చేశారు. ఇస్మాయేల్ మాట్లాడుతూ, పశ్చిమగోదావరి జిల్లాలో కులగణన సర్వే పారదర్శకంగా లేదన్నారు. అధికారులు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కులగణన చేయాల్సి ఉన్నా అది జరగడం లేదని అన్నారు. వలంటీర్లు ఫోన్లు చేసి ఓటీపీలను నమోదు చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. సర్వేలో క్రిస్టియన్ మతం అని నమోదు చేయడం లేదని ఆరోపించారు. మండలంలో కులగణన రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అనంతరం ఎంపీడీవో ఎం.ఎస్.ప్రభాకరరావు, తహసీల్దార్ టీపీ కృష్ణారావులకు వినతి పత్రాలు అందజేశారు. కన్వర్టెడ్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.సుందరరావు, కన్వీనర్ వై.సాల్మన్‌రాజు, సురేష్‌బాబు, విజయ్‌కుమార్, పురుషోత్తం, హేమకుమార్, సురేష్‌పాల్, క్రైస్తవ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జంతర్‌మంతర్ దీక్షలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ముప్పాళ్ళ

భీమవరం అర్బన్, జనవరి 31: రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు కోరుతూ ఈనెల ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన మోదీని గద్దెదించే సమయం ఆసన్నమైందని ముప్పాళ్ళ అన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రజాకంటక పాలనకు చరమగీతం పాడాలన్నారు. పచ్చని పశ్చిమ గోదావరి జిల్లా నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. వ్యవసాయం సంక్షోభంలోకి వెళ్లిందని, ఆక్వా రంగం కుదేలయిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు ఆదుకోవాలని, ఫించన్లు ముదువేల నుంచి ఆరు వేలకు, దివ్యాంగులకు రూ.ఏడువేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, నెక్కంటి సుబ్బారావు, ఎం. సీతారం ప్రసాదు పాల్గొన్నారు.

కొల్లేరును రక్షించుకుందాం


సీడీ ఆవిష్కరిస్తున్న మల్లాడి, విమలక్క తదితరులు

ఏలూరు రూరల్, జనవరి 31: ఏలూరు జిల్లాలో సహజసిద్ధంగా ఏర్పడిన మంచినీటి సరస్సు కొల్లేరు.. లక్షకుపైగా ఎకరాల్లో వ్యాపించి ఉంది.. ప్రకృతి అందాలకు, అరుదైన వలసపక్షులకు, ఎన్నోరకాల చేపలకు నిలయం.. దీన్ని కాపాడుకుందామని, ఇక్కడి ప్రజలను రక్షించుకుందామని, ఇందుకోసం తనవంతు కృషిచేస్తానని పాండిచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. కొల్లేరు పరిరక్షణ ఉద్యమకారిణి ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కొల్లేరు బతుకుచిత్రంపై అరుణోదయ విమలక్క గానం చేసిన సీడీని బుధవారం వైఎమ్‌హెచ్‌ఏ ప్రాంగణంలో కొల్లేరు సాహితివేత్త చింతపల్లి వెంకటనారాయణ ఆవిష్కరించారు. మల్లాడి మాట్లాడుతూ, కొల్లేరు ఆపరేషన్ తరువాత ఎంతోమంది నిరాశ్రయులయ్యారన్నారు. బతుకుదెరువుకు వలసలు పోయారని వారికి నష్టపరిహారం అందించాలని కోరారు. కొల్లేరు పర్యావరణ, జీవనోపాధి దెబ్బతినకుండా తనవంతు కృషిచేస్తానన్నారు. బీసీ-1లో ఉన్న మత్స్య కారులను 37వ నెంబర్‌లోకి మార్చారని దీన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళదామన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, కొల్లేరు పరిరక్షణకు ఐకమత్యంగా పోరాడదామన్నారు. పలువురు మాట్లాడుతూ సాంప్రదాయ చేపలవేటను, సంస్కృతిని గుర్తించి మెరుగైన విద్య, స్థానికులకే ఉపాధ్యాయ పోస్టులు, ఉప్పుటేరు వద్ద వాటర్ రెగ్యులేటర్ నిర్మించాలని,కొల్లేరు ఎడారిగా మారకుండా ఐదు అడుగులు లోతు నీరు ఉండేలా చూడాలని, వలసల నివారణ, కొల్లేరు ప్రక్షాళన ఏకకాలంలో జరిగేలా ముందుకు సాగుదామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, పార్టీలకతీతంగా ఏర్పాటుచేసిన సభలో ఓ నాయకుడు మూడో కాంటూరు చంద్రబాబుతో సాధ్యమని మాట్లాడటంతో వైసీపీ నాయకులు ఖండించారు. కొద్దిసేపు సభ ఉత్కంఠగా సాగింది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ కమిటీలో మాదిగలకు అన్యాయం


మాట్లాడుతున్న పసుపులేటి చినబాబు

పాలకొల్లు రూరల్, జనవరి 31:పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు ప్రకటించారనీ, దీనిలో మాదిగలు ఒక్కరు కూడా లేరని, ఎస్సీ కోటాలో నలుగురు డైరెక్టర్లను మాల సామాజిక వర్గానికి కేటాయించి మాదిగలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ పశ్చిమ గోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి చినబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు బెత్లెహంపేటలో బుధవారం ఎమ్మార్పీఎస్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. పాలకొల్లు టౌన్, పాలకొల్లు రూరల్, యలమంచిలి, పోడూరు మండలాల ఎస్సీసెల్ అధ్యక్షులను నలుగురిని ఎస్సీ మాల సామాజిక వర్గానికి కేటాయించి కనీసం మాదిగలకు ప్రాతినిధ్యం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా నియోజకవర్గంలో మాదిగలకు స్థానం లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో వైసీపీకి మాదిగలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండేటి వరదరాజు పాల్గొన్నారు.

నేత్రపర్వం .. చాత్మార్‌సేవ


క్షేత్రపురవీధుల్లో ఊరేగుతున్న స్వామి

ద్వారకాతిరుమల, జనవరి 31: ఉభయదేవేరులతో చినవెంకన్నకు బుధవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన చాత్మార్‌సేవ భక్తులను అలరించింది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతీ ఇంటిముందు భక్తులు స్వామి వారి మూర్తులకు హారతులు పట్టారు.

శునకాల స్వైరవిహారం.. 9 మందికి గాయాలు

నరసాపురం రూరల్, జనవరి 31: మండలంలోని సారవ గ్రామంలో బుధవారం శునకాలు స్వైరవిహారం చేసి తొమ్మిది మందిని గాయపరిచాయి. ఉదయం ఇళ్ల, పొలాల వద్ద పని చేసుకుంటున్న సమయంలో కుక్కలు వారిపై దాడి చేశాయి. బాధితులకు ఎల్‌బిచర్ల పీహెచ్‌సీ, నరసాపురం ఆస్పత్రి వైద్య సిబ్బంది వ్యాక్సిన్లు వేశారు. అదే సమయంలో రెండు మేకలపై కూడా దాడి చేశాయి.

ఆధునిక సాగు అదుర్స్!

- తగ్గిన పెట్టుబడి.. సమయం ఆదా
- కూలీల కొరత తీరుస్తున్న వైనం
- పొగాకు, మిర్చిపై అన్నదాతల మొగ్గు


రైతు పుల్లయ్య
డ్రోన్ ద్వారా పొగాకు పంటకు మందు పిచికారి

జీలుగుమిల్లి, జనవరి 31 : సంప్రదాయ సాగును పక్కనబెట్టి ఆధునిక పద్ధతుల్లో వాణిజ్య పంటలను సాగు చేస్తుండడంతో పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాక, సమయం ఆదా అవుతోంది. కూలీల కొరతను అధిగమించడంతో పాటు దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో కొందరు అన్నదాతలు ఆధునికంపై మొగ్గుచూపుతున్నారు. పంటలు ప్రకృతి వైపరీత్యాలను కొంతమేర తట్టుకుని రైతుకు మేలు చేకూరుస్తున్నాయి.

పి.రాజవరానికి చెందిన రైతు గూడపాటి పుల్లయ్య ఈ ఏడాది 50 ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. ఓ వైపు వాతావరణ పరిస్థితులు, మరోవైపు కూలీల కొరత, ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు కాని పరిస్థితి. అయితే తనదైన రీతిలో పొగాకు సాగులో కూలీలు తగ్గింపు, పంటలో అంతర కృషి (కలుపు నివారణ, పైపాటు) వంటి పనుల్ని సులభంగా అధిగమించారు. పురుగుమందులు స్ప్రే చేసేందుకు ఎకరానికి సుమారు రూ.800 కూలీలకు ఖర్చు చేస్తుంటే.. పుల్లయ్య డ్రోన్ సాయంతో రోజుకు 10 ఎకరాల వరకు స్ప్రే చేస్తున్నారు. 35 రూపాయలతో ఏడు నిమిషాల్లో ఎకరం పంటకు డ్రోన్ స్ప్రే చేస్తుంది. ఈ పరికరాన్ని ఐటీసీ ద్వారా అద్దెకు తెస్తున్నారు. పురుగు మందు సాధారణంగా మనుషులు స్ప్రే చేస్తే ఎకరానికి రూ.3,000 ఖర్చు అవుతుండగా, డ్రోన్ ద్వారా 50 శాతం మందు ఆదా అవుతుండడంతో ఎకరానికి రూ.1500 మాత్రమే వెచ్చిస్తున్నారు. పంటకు మల్చింగ్ (పాలిథిన్ కవర్ వేసి మధ్యలో రంధ్రాలు చేసి పొగాకు నాటటం) వేసి డ్రిప్ ఏర్పాటు చేశారు. దీంతో కూలీలు, తడి పెట్టే ఖర్చు రెండు తగ్గాయి. మల్చింగ్ షీట్ ఏర్పాటుకు ఎకరానికి రూ.3,500 ఖర్చు అవుతుంది.

ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకుని..

మిచౌంగ్ తుఫాన్‌కు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మల్చింగ్ ద్వారా రైతులకు కొంత మేలు జరిగింది. వరద ప్రవాహానికి మొక్కలు కొట్టుకు పోకుండా నిలిచాయి. చీడపీడల్ని తట్టుకుని ఆరోగ్యంగా పెరుగుతుంది. డ్రోన్ ద్వారా పురుగు మందులు, డ్రిప్ ద్వారా తడులు అందించడంతో పెట్టుబడి తగ్గుతుంది.

మిర్చి పంటలో సోలార్ దీపం..

ఉదయ్ భాస్కర్ కాలనీకి చెందిన చిలకా నాగేశ్వరావు మిర్చి పంటలో పురుగు మందుల వాడకం తగ్గించారు. ఎకరానికి నాలుగు చోట్ల సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. పంట పాడు చేసే పురుగులు రాత్రి సమయంలో సోలార్ దీపం వెలుగు వద్దకు వచ్చి దానికి ఏర్పాటు చేసిన గమ్ బేసిన్‌లో పడి చనిపోతాయి. ఏటా పురుగు మందులకు ఎకరానికి రూ.50 వేల నుంచి రూ.70 వేలు వరకు వాడేవారు. పురుగు మందులు వాడకుండా సోలార్ దీపపు ఎర ఏర్పాటు ద్వారా చీడపీడలు నివారిస్తున్నారు. ఈ దీపాలు పగటి పూట సూర్యరశ్మిని స్వీకరించి రాత్రి సమయంలో వెలుతురు ఇస్తాయి.

ఖర్చు తగ్గుతుంది..

గత ఏడాది మిర్చి, కూరగాయల పంటల్లో సోలార్ దీపాలు ఏర్పాటును భద్రాచలం, చర్ల సమీపంలో తెలంగాణ వైపు ప్రాంతాల్లో చేపట్టారు. ఒక్కొక్క దీపం రూ.1,350. ఎకరానికి మూడు సోలార్ లాంతర్‌లు (దీపాలు) ఏర్పాటు చేసుకుంటే సరిపోతుంది. ఆ తర్వాత ఖర్చు ఉండదు.


-చిలకా నాగేశ్వరరావు, మిర్చి రైతు - ఉదయ్‌భాస్కర్ కాలనీ


మిర్చిలో పురుగులకు ఎరగా ఏర్పాటు చేసిన సోలార్ దీపం

ఓటర్ల తుది జాబితా..తప్పుల తడక!

మృతులు బతికే ఉన్నట్టుగా..

టి.నరసాపురం, జనవరి 31 : మండలంలోని కె.జగ్గవరంలో ఓటర్ల తుది జాబితాలో తప్పులు దొర్లాయి. గ్రామానికి సంబంధం లేని ఇద్దరు వ్యక్తులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు మరో నలుగురికి రెండేసి ఓట్లు, మృతి చెందిన కొందర్ని ఓటర్ల జాబితాలో బతికే ఉన్నట్టు చూపించారు. తుది జాబితా ప్రకారం మండలంలో మొత్తం ఓటర్లు 45,725 మంది. పురుషులు 22,700, స్త్రీలు 23,025 మంది. 15 పంచాయతీలు ఉండగా కె.జగ్గవరంలో ఓటర్ల తుది జాబితాను పరిశీలిస్తే ఇన్ని తప్పులు ఉన్నాయి. మండల వ్యాప్తంగా ఓటర్ల జాబితా పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. 85వ పోలింగ్ బూత్ పరిధిలో సీరియల్ నెంబరు 1093లో బొంతు కావ్యశ్రీ ఉన్నారు. ఆమె ఈ గ్రామానికే చెందినది కాదు. అయినప్పటికీ ఆమెకు ఓటు కల్పించారు. సీరియల్ నెంబరు 1362లో పెనుమానూరి తిరుపతి స్వామి కూడా ఈ గ్రామానికి చెందిన వారు కాదు. ఈయనకు ఓటు ఉంది. 85వ పోలింగ్ బూత్ పరిధిలో నాగాబత్తుల దీవెనమ్మకు సీరియల్ నెంబరు 944, మరో ఓటు 1308లలో చంటి అనే పేరుపై ఓటు కలిగిఉంది. జాయ్‌ప్రైస్ ఎస్తేర్ లింగారెడ్డికి సీరియల్ నెంబరు 1333తో పాటు 1310లో కూడా ఓటు ఉంది. సీరియల్ నెంబరు 1332లో వేమూరి లావణ్య (తండ్రి- పేరు కేశవరావు) అని, సీరియల్ నెంబరు 1345లో కూడా లావణ్య వేమూరి (ఇతరులు-ఆది) అని రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబరు 1346 లావణ్య తేలె ఓటరు జాబితాలో సీరియల్ నెంబరు 1347లో కూడా లావణ్య తేలె ఉంది. ఫోటో ఉండాల్సిన చోట ఆధార్ కార్డు ఫోటో వచ్చింది.



ఓటు కోసం దరఖాస్తు చేసిన కె.జగ్గవరంనకు చెందిన గోరింకల శ్రీరాజు, గోరింకల సౌమ్య, పరసా కావ్య జయవరపు శ్యామల సుచిత్ర నలుగురి పేర్లు మాత్రం తుది జాబితాలో రాలేదు. ఓటర్ లిస్టులో డోర్ నెంబర్‌లకు బదులుగా ఊరి పేర్లు దర్శనమిచ్చాయి. కె.జగ్గవరంలో సీరియల్ నెంబరు 24 బొడ్డపాటి ప్రసన్నకు ఓటర్ లిస్టులో ఇంటి నెంబరుకు బదులు శ్రీరామవరం అని ఉంది. సీరియల్ నెంబరు 25 దేవరకొండ పుణ్యేశ్వరావు ఇంటి సంఖ్య బదులు కేతవరంగా నమోదైంది. ఒకే ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులకు ఓట్లు వేర్వేరు వార్డుల్లోకి వెళ్లగా వారి ఇంటి నెంబరుపై సంబంధం లేని వ్యక్తులకు ఇంటి డోర్ నెంబర్ ఇచ్చి ఓటు కల్పించారు. సీరియల్ నెంబర 696లో ఒంటిపల్లి లక్ష్మీకాంతం సుమారు రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. సీరియల్ నెంబరు 437లో మొండు జగన్మోహన్‌రెడ్డి రెండు నెలల క్రితం, సీరియల్ నెంబరు 907లో బండి భూషణం ఏడు నెలల క్రితం మృతి చెందాడు. సీరియల్ నెంబరు 961లో బత్తుల దేవమాత సంవత్సరం క్రితం మృతి చెందారు. వీరందరూ తుది జాబితాలో ఓటర్లుగా ఉన్నారు.

నాడు-నేడు పనులకు బిల్లు చెల్లించలేదని..

మోగల్లులో పాఠశాలకు తాళం

- ఆరుబయటే నిలబడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు
- కాంట్రాక్టర్‌తో మాట్లాడిన ఎంఈవో .. అరగంట ఆలస్యంగా తెరుచుకున్న స్కూల్


ఆరుబయట కూర్చున్న చిన్నారులు.. (ఇన్‌సెట్) పాఠశాలకు తాళం

పాలకోడేరు, జనవరి 31 : చేసిన పనులకు డబ్బులు చెల్లించడం లేదంటూ పాఠశాలకే తాళం వేసిన ఘటన అల్లూరి సీతారామరాజు పురిటిగడ్డ అయిన మోగల్లులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..నాడు-నేడు పనుల్లో భాగంగా స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలో బాత్రూమ్ పనులను ఓ కాంట్రాక్టర్ చేపట్టారు. ఎస్టిమేషన్ ప్రకారంగా రూ.15,000 మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ ఆ పనులకు రూ.33 వేలు ఖర్చు అయిందంటూ లెక్కలు చూపించాడు. రూ.15 వేలు మాత్రమే మంజూరు అయ్యాయని ఇంజనీరింగ్ అసిస్టెంట్ చెక్కు అందించారు. మిగిలిన సొమ్ము ఎవరు ఇస్తారంటూ ఆ కాంట్రాక్టర్.. ఇంజనీరింగ్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుడు సింహాచలంను ప్రశ్నించారు. తానేం చేస్తానని హెచ్‌ఎం కొంతకాలంగా సమాధానం ఇస్తూ వచ్చారు. ఆగ్రహించిన కాంట్రాక్టరు సహాయకుడు బుధవారం పాఠశాలకు తాళం వేశాడు. దీంతో స్థానికులు ఎంఈవో నాగరాజు దృష్టికి తీసుకువెళ్లారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి తాళం తెరిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

దీనిపై ఎంఈవోను వివరణ కోరగా, పనులు చేయడం వాస్తవమేనని, పాఠశాలకు తాళం వేయడం మంచి పద్ధతి కాదని చెప్పడంతో అరగంట ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు పాఠశాల తెరిచినట్టు తెలిపారు.

క్రైం కార్నర్

చెల్లెలు అదృశ్యంపై ఫిర్యాదు

ఆకివీడు, జనవరి 31: చెల్లెలు అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. విజయవాడ బట్టల దుకాణంలో పనిచేస్తున్న చెల్లెలు స్థానిక వారపు సంతలో ఉంటున్న అక్క ఇంటికి రెండు రోజులు క్రితం వచ్చింది. మంగళవారం రాత్రి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో అక్క ఫిర్యాదు చేసింది. చెల్లెలు కనబడుటలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

మహిళపై బాలుడి అత్యాచారం

భీమవరం క్రైం, జనవరి 31 : బహిర్భూమికి వెళ్లిన ఓ మహిళ(25)పై ఓ బాలుడు(16) అత్యాచారం చేసిన ఘటన ఇది. వివరాలివి. తాడేరు గ్రామానికి చెందిన మహిళ బుధవారం సాయంత్రం బహిర్భూమికి వెళ్లింది. అక్కడే కాపుకాసిన ఓ బాలుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. మహిళ బంధువుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

మహిళను మోసగించిన యువకుడిపై కేసు

ఏలూరు క్రైం, జనవరి 31 : ప్రేమించానని మాయమాటలు చెప్పి.. గర్భిణిని చేసి ఆపై ఆ గర్భాన్ని విచ్ఛిన్నం చేసి పెళ్లికి నిరాకరించాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి. ఏలూరు టైటస్‌నగర్‌కు చెందిన పిల్లగ్రోవుల చిన్ని (20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అతడికి దూరపు బంధువైన యువతి (23)తో సన్నిహితంగా ఉండేవాడు. ప్రేమ పేరుతో ఆమెను లోబర్చుకుని గర్భం చేశాడు. మందులు ఇచ్చి గర్భం విచ్ఛిన్నం చేశాడు. వివాహానికి నిరాకరించడంతో ఆ యువతి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. చిన్నుతో వివాహం చేయాలని ఆ యువతి అతడి ఇంటి ముందు ధర్నా చేపట్టింది.

ఇదిలా ఉండగా, ఆమెకు అంతకు ముందే మరో వ్యక్తితో వివాహమైందని, బిడ్డకు కూడా జన్మనిచ్చిందని యువకుడి బంధువులు, స్థానికులు చెబుతున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

ఊరెళ్లి వచ్చేలోగా.. ఇల్లు దోచేశాడు..

ఏలూరు క్రైం, జనవరి 31 : ఊరెళ్లి వచ్చేసరికి ఇంటితాళాలు పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయిన ఘటన ఇది. సత్రంపాడు బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న జక్కంపూడి సీతారామయ్య ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లారు. తిరిగి బుధవారం వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. తొమ్మిది కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.50 వేల నగదు దొంగలు అపహరించుకుపోయాడు. బాధితుడు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

వీరవాసరం, జనవరి 31: ద్విచక్ర వాహనాల దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు మోటారుబైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి. వీరవాసరం రైల్వేగేట్ వద్ద హెల్మెట్ చెకింగ్, వాహన తనిఖీలు చేస్తున్నారు. పోలీసులను చూసి నవుడూరు నుంచి వీరవాసరం వస్తున్న వ్యక్తి మోటారుబైక్ వెనుకకు తిప్పి వెళ్లిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. మడుగుపోలవరం పంచాయతీ జొన్నలపాలెం-1కి చెందిన వేంద్ర చంద్రశేఖరరావుగా గుర్తించారు. నిందితుడు గతంలో మూడు నెలలు జైలుశిక్ష అనుభవించాడని ఎస్ఐ పి.రమేష్ తెలిపారు. గత డిసెంబరులో వీరవాసరంలో కొంతం సత్యనారాయణ మోటారుసైకిల్‌ను, నందమూరుగరువు భక్తాంజనేయస్వామి ఉత్సవాల్లో రెండు మోటారుబైక్‌లను అపహరించాడు. నిందితుడి వద్ద ఉన్న బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభచూపిన సీఐ సత్యకిషోర్, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బందిని ఎస్పీ ఉప్పాడ రవిప్రకాశ్, డిఎస్పీ బి. శ్రీనాథ్ అభినందించారు.

వైద్యం వికటించి చిన్నారి మృతి

- బంధువుల ఆందోళన




మృతదేహంతో ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన బంధువులు

నూజివీడుటౌన్, జనవరి 31: వైద్యం వికటించి ఓ చిన్నారి మృతిచెందిన విషయమై పట్టణంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే - ఆర్.ఆర్‌పేటకు చెందిన వేముల రంగబాబు కుమారుడు యశ్వంత్‌శ్రీరామ్(11) మూడురోజుల క్రితం కాలికి గాయమవడంతో తుమ్మలవారివీధిలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు మందులు ఇచ్చి పంపారు. ఛాతిలో నొప్పి అంటూ తిరిగి బుధవారం ఉదయం ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షలు చేసిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ ఉందని చెప్పారు. చిన్నారికి ఇంజక్షన్ ఇవ్వగా ఇంటికెళ్లేసరికి శరీరం మొత్తం నీలం ఛాయకు మారింది. దీంతో తిరిగి చిన్నారిని వైద్యం చేసిన ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో తక్షణం విజయవాడకు తీసుకువెళ్లాలని వైద్యులు పేర్కొంటూ మరోరెండు ఇంజక్షన్‌లు ఇచ్చి పంపారు. ఆసుపత్రి నుంచి బయటకు వచ్చి చిన్నగాంధీబొమ్మ సెంటర్ దాటే సమయానికే చిన్నారి పరిస్థితి మరింత దిగజారడంతో స్థానికంగా ఉన్న మరో ఆసుపత్రికి చిన్నారిని తీసుకువెళ్లామని అయితే అక్కడ పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేలోపే శ్రీరామ్ మృతిచెందాడంటూ బంధువులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం వికటించడంతోనే పిల్లాడు మృతిచెందాడంటూ చిన్నారి బంధువులు, ఆర్.ఆర్‌పేట వాసులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని చిన్నారి మృతికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

మృతదేహంతో ఆసుపత్రి వద్ద నిరసన

తొలుత వైద్యం అందించిన ప్రైవేట్ ఆసుపత్రి వద్దకు యశ్వంత్‌రామ్ మృతదేహాన్ని తీసుకువచ్చిన బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్ వల్లే పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడని, న్యాయం చేయాలని తల్లిదండ్రులు, బంధువులు, రామాయమ్మరావు పేట వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్ మూర్తి, వైద్యవివరాలు, ఇతర అంశాలపై వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. చిన్నారి మృతిచెంది దాదాపు మూడు గంటలు గడుస్తున్నా వైద్యులపై చర్యలు తీసు కోకుండా ఉపేక్షిస్తున్నారంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఫిట్ ఇండియా విజేతలకు బహుమతులు


మాట్లాడుతున్న ఉదయ్ సందీప్

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31: ఫిట్ ఇండియాలో భాగంగా బుధవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో డిగ్రీ, పీజీ విద్యార్థినులకు స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. సాయ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు వినాయకప్రసాద్, ఉదయ్‌సందీప్ మాట్లాడుతూ, కేంద్ర క్రీడామంత్రిత్వశాఖ, ఖేలో ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏటా పోటీలు నిర్వహిస్తోందని వివరించారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ మాట్లాడుతూ, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కబడ్డీ, వాలీబాల్, వ్యాసరచన, షాట్‌పుట్ విజేతలకు బహుమతులందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ, ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సెలీన్‌రోజ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి డి.ప్రసాద్, నేషనల్ హాకీ క్రీడాకారుడు షేక్ అజీమ్, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియాక్రిస్టియా పాల్గొన్నారు.

జూడోలో సింహాద్రికి బంగారు పతకం


సింహాద్రిని అభినందిస్తున్న జగపతిరాజు

భీమవరం రూరల్, జనవరి 31 : విజయవాడలోని పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 30న జరిగిన జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియట్ జూడో పోటీల్లో తమ ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న దొండపాటి సింహాద్రి గోల్డ్ మెడల్ సాధించారని డైరెక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో సింహాద్రిని కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు సత్కరించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్. హరిమోహన్ మాట్లాడుతూ, ఫిబ్రవరి ఐదు, ఆరు తేదీల్లో అమృత్ సర్‌లో గురునానక్ విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీలకు జేఎన్టీయూకే టీమ్ తరుపున సింహాద్రి ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు అభినందించారు.

పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి


ఉండిలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ రాంసుందర్‌రెడ్డి

ఉండి/అత్తిలి, జనవరి 31: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగ వంతం చేయాలని జాయింట్ కలెక్టరు ఎస్.రాంసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉండి-1 గ్రామ సచివాలయ పరిధిలోని ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను బుధవారం ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ప్రభుత్వ ఫార్మెట్ ద్వారా లబ్ధిదారులను హక్కు దారులుగా చేర్చాలన్నారు. పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆర్డీవో శ్రీనివాసులరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత మాధుర్, శ్రీనివాస్, ఎంపీడీవో ఎస్.రవీంద్ర, డిస్ట్రిక్ మేనేజరు భార్గవ్ రామ్ పాల్గొన్నారు. అత్తిలిలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చిన ఫార్మెట్లను జేసీ స్వయంగా పరిశీలించి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆన్‌లైన్‌లో లాగిన్ పూర్తి అయిన వెంటనే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ మొదలుపెట్టాలని సూచించారు. తహసిల్దార్ రామాంజనేయులు, డిస్ట్రిక్ట్ మేనేజర్ భార్గవరామ్ పాల్గొన్నారు.

టీబీ నియంత్రణ సంస్థలో నిబంధనల మేరకే పోస్టుల భర్తీ

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : ఉమ్మడి జిల్లా క్షయ నియంత్రణ సంస్థ గతేడాది చేపట్టిన వివిధరకాల కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా టీబీ కంట్రోల్ యూనిట్‌లో ఎన్‌హెచ్‌ఎం స్కీంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సీనియర్ టీబీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టుల భర్తీకి 2022 ఆగస్టులో అప్పటి టీబీ నియంత్రణాధికారిణి డాక్టర్ రత్నకుమారి నోటిఫికేషన్ జారీచేశారు. గతంలో హెల్త్ విజిటర్‌గా పని చేస్తున్న ఓ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించారు. ఈ పోస్టును భర్తీ చేయడానికి కొత్తగా నోటిఫికేషన్ జారీచేయకుండా 2022లో జారీఅయిన నోటిఫికేషన్‌లో హెల్త్ విజిటర్ ఉద్యోగానికి దరఖాస్తుచేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టు నుంచి రోస్టర్ పాటించకుండా అనర్హులైన అభ్యర్థిని ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండానే నియమించారని, రూ.లక్షలు చేతులుమారాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రస్తుత టీబీ నియంత్రణాధికారి డాక్టర్ నాగేశ్వరరావును వివరణకోరగా 'టీబీ హెల్త్ విజిటర్ పోస్టులు మూడింటిని భర్తీచేయడానికి నోటిఫికేషన్‌ను జారీచేయగా 63మంది దరఖాస్తుచేసుకున్నారు. ఒక్క పోస్టు మాత్రమే భర్తీ అయింది. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్‌కు గడువు/కాలపరిమితి ఏడాది ఉంటుంది. ఆ ప్రకారం గతేడాది డిసెంబరు 21 వరకు గడువు ఉంటుంది. అప్పటి టీబీ నియంత్రణాధికారిణి రత్నకుమారి మిగిలిన రెండుపోస్టులను మెరిట్‌లిస్టులో తదుపరి అర్హులైన అభ్యర్థులతో భర్తీచేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్ నుంచి గతేడాది ఆగస్టు 9న అప్రూవల్ తీసుకున్నతర్వాతే నియామకాలను పూర్తిచేశారు. ఇందులో ఎక్కడా అక్రమాలు, అవినీతికి ఆస్కారం లేదు' అని వివరించారు.

గౌరవ వేతనంపై టీచర్ పోస్టుల భర్తీ ప్రతిపాదన విరమించుకోవాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 31 : ఉపాధ్యాయ నియామకాల్లో రెండేళ్ల గౌరవ వేతనంతో పనిచేసే ప్రతిపాదనలతో డీఎస్సీ రిక్రూట్‌మెంట్ చేపడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు బుధవారం ఓ ప్రకటనలో తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అన్ని అర్హతలున్నా గతంలో అప్రంటీస్ పేరుతో రెండేళ్లపాటు వెట్టిచాకిరీచేయించుకున్న ప్రభుత్వం మళ్లీ గౌరవవేతనం పేరుతో అదే విధానాన్ని తాజా నిర్ణయంతో తెచ్చిపెట్టినట్టయిందని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 50వేల టీచరు పోస్టులు ఖాళాగావుంటే కేవలం 6,100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామనడం సరికాదన్నారు.



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానించిన తోట సీతారామలక్ష్మి

టీడీపీలో చేరిన 50 మంది వైసీపీ నాయకులు

భీమవరం అర్బన్, జనవరి 31: జగన్ పాలనతో విసుగుచెందిన దళిత సామాజికవర్గానికి చెందిన 50మంది టీడీపీలోకి రావడం అభినందనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. దిరుసుమర్రుకు చెందిన 50 మంది వైసీపీ నాయకులు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రానున్న రోజులలో టీడీపీ, జనసేన కూటమి అధికారం చేపడుతుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి కౌరు పృధ్వీశంకర్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి తీసుకురావడానికి కష్టపడి పనిచేసిన ఎస్సీ నాయకులను వైసీపీ విస్మరించిందని అందుకే టీడీపీలోకి వచ్చారన్నారు. దిరుసుమర్రు గ్రామ వార్డు మెంబర్ తోకల తాతరాజు, బేతాళ బెంజిమెన్, బాలే ప్రసాదు, దాసరి జార్జ్ విక్టర్, రాట్నాల రాంబాబు ఆధ్వర్యంలో పార్టీలో చేరారన్నారు. పార్టీ మండల నాయకులు రేవు వెంకన్న, జోడ్డ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్ నాశనం



అరిమిల్లి నివాసంలో టీడీపీలో చేరిన యువత

తణుకు, జనవరి 31: వైసీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్ నాశనమైందని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం టీడీపీ యువ నాయకుడు ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో తణుకు పట్టణం నుంచి పలువురు యువత టీడీపీలో చేరగా వారికి ఆరిమిల్లి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జగన్ అధికారంలోకి వచ్చి నాలుగున్న రేళ్లయినా యువతకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. చంద్రబాబు, పవన్ ఆధ్వర్యంలో వచ్చే ప్రభుత్వంతోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, జక్కంశెట్టి వెంకటేష్, మల్లిన రాధాకృష్ణ, తమరాపు పల్లపరావు, సప్పా రాజు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ బ్యాంకులో ఆక్వాఫీడ్, మెడిసిన్స్ : పీవీఎల్



ఆక్వా రైతులకు ఫీడ్ అందజేస్తున్న పీవీఎల్, కేశిరెడ్డి

ఆకివీడురూరల్ జనవరి 31 : రూరల్ బ్యాంకు ద్వారా ఆక్వా రైతులకు ఆక్వాఫీడ్, మెడిసిన్స్ విక్రయం చేస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. చినకాపవరంలో రూరల్‌బ్యాంకు ద్వారా రొయ్యల మేతను రైతులకు విక్రయించే ఏర్పాటు చేశారు. ఇక నుంచి ఈబ్యాంకులో ఆక్వామేతలు, మెడిసిన్స్‌ను తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. బ్యాంకులోని 4,500 ఖాతాదారులకు 2020-23 వరకు మూడేళ్లకుగాను మొత్తం రూ.24,12,239 డివిడెండ్లు వచ్చినట్లు తెలిపారు. రూరల్‌బ్యాంకు చైర్మన్ కేశిరెడ్డి మురళి, జడ్పీటీసీ యండగండి శ్రీను, నాతిరెడ్డి అన్నవరం, కఠారి కేశవరావు, కత్తుల శ్రీను, నాతిరెడ్డి సుబ్బారావు, బ్యాంకు కార్యదర్శి సతీశ్, బాబు, ఎ.రమేష్, పి.పండు పాల్గొన్నారు.

'చంద్రబాబు హయాంలోనే బ్రాహ్మణుల అభివృద్ధి'



మిర్తిపాటి గున్నేశ్వరరావు

భీమవరం అర్బన్ : బ్రాహ్మణ కార్పొరేషన్, క్రెడిట్ సొసైటీలు ఏర్పాటు చేయడంతో పాటు 200పైచిలుకు నామినేటెట్ పదవులు ఇచ్చి బ్రాహ్మణులను అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుదే అని జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి, బ్రాహ్మణ సంఘ నాయకులు మిర్తిపాటి గున్నేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆనాడు పార్టీలకు అతీతంగా కార్పొరేషన్‌లో ఐవీఆర్ చైర్మన్‌గా ఉన్న సమయంలో వైసీపీ నాయకులుగా చలామణి అవుతున్న వారికి కూడా పదవులు ఇచ్చారన్నారు. ఇప్పుడు వైసీపీ పాలనలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు లేవు. పేద మధ్యతరగతి బ్రాహ్మణులకు పథకాలు లేవన్నారు. రానున్న ఎన్నికలలో బ్రాహ్మణ సమాజం అంతా ఏకమై చంద్రబాబును గెలిపించాలని కోరారు.

సంగీత పాఠశాలకు సహకారం అందిస్తా : మోషేన్ రాజు

భీమవరంటౌన్, జనవరి 31 :సంగీత విద్యను బాలలకు నేర్పించాలని, సంగీత పాఠశాల పెడితే సహకారం అందిస్తానని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఇటీవల సంగీత విద్వాంసులు దేశవిదేశాల్లో భజనలు, సంగీత కచేరీలు నిర్వహించిన పిప్పళ్ళ ప్రసాద్‌కు యునైటెడ్ థియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా ఆయన అభినందించి సత్కరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిప్పళ్ళ ప్రసాద్‌తోపాటు ఎంపీ సుమలత, ప్రఖ్యాత వాయిద్య కళాకారులు శివమణికి డాక్టరేట్ అందుకున్నారన్నారు. అనంతరం ప్రసాద్‌ను సత్కరించారు.

'పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం'

భీమవరం అర్బన్, జనవరి 31 :పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో జేఎన్వీ గోపాలన్ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బలమైన ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అంగన్వాడీల సమ్మె రుజువు చేసిందన్నారు. వీవోఏలు, ఆశా వర్కర్స్, వీఆర్ఏలు ఆందోళనకు సిద్ధం అవుతున్నారని వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు కర్రి నాగేశ్వరరావు, తెలగం శెట్టి సత్యనారాయణ, ఎం త్రిమూర్తులు, డి.కల్యాణి, డి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

పాలకోడేరు, జనవరి 31 : వైసీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండల పరిషత్ నిధులతో రహదారులు, డ్రెయినేజీలు చేపట్టాలని కోరారు. అన్ని గ్రామాలను మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీతులసి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సోడదాసి నరేష్, లక్ష్మీతులసి, ఎంపీడీవో నాగేంద్రకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'



మోటారు సైకిల్ ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 31: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితంగా ఇళ్లకు చేరవచ్చని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి. సురేంద్రసింగ్ నాయక్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఎంవీఐ కార్యాలయం వద్ద బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. హెల్మెట్ ధరించి పట్టణంలో చేపట్టిన ర్యాలీని పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో కొత్త సంస్కరణలు

నరసాపురం, జనవరి 31:మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉన్నత విద్యలో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నట్టు ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని వైఎన్ కళాశాలలో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు ఎడ్యుకేషన్ విధానంలో వస్తున్న టెక్నాలజీ, ఆన్‌లైన్‌ను వినియోగించుకుని ముందుకు సాగాలన్నారు. బీఎస్సీ, బీజెడ్‌సీ, బీకాం కోర్సుల్లో విద్యామండలి ప్రవేశపెట్టిన కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు యూజీసీ నుంచి ప్రశంసలు లభించాయన్నారు. అనంతరం వైఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు మాట్లాడారు. వీసీని పాలకవర్గం ఘనంగా సత్కరించింది. ప్రిన్సిపాల్ కనకారావు, డైరెక్టర్ చింతారావు, సుబ్బారావు, గంధం రామకృష్ణ, డాక్టర్ పార్థసారథి, బి.రత్నం పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

» వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైంది : ఎమ్మెల్యే రామరాజు



గుత్తులవారిపాలెంలో ఇంటింటికి టీడీపీలో ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు రూరల్/పాలకోడేరు, జనవరి 31 : రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని, వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, రానున్న 70 రోజులలో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే రామరాజు అన్నారు. ఆకివీడు మండలం అజ్జమూరు, పాలకోడేరు మండలం మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో బుధవారం 'ఇంటింటికి తెలుగుదేశం, బాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. గుత్తులవారిపాలెంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగిపోయారని, టీడీపీ, జనసేన కూటమిని గెలుపించుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. అజ్జమూరులో పార్టీ మండల అధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాదు, నౌకట్ల రామారావు, బచ్చు సరళ, జాకీర్, అజమాల్, బొల్లా వెంకట్రావు, బొల్ల శేషు, బత్తుల రవి, తోట బాబూరావు, బచ్చు కృష్ణ తదితరులున్నారు. గుత్తులవారిపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు దెందుకూరి రాగూర్ కోటేశ్వరరాజు, ఉండి నియోజకవర్గ బీసీ టీడీపీ నాయకులు కామన రాంబాబు, మల్లిపూడి శ్రీనివాస్, మోగల్లు బాబు, సంకురుడు, నడిపూడి అప్పారావు, ఇళ్ల పండు, ఆరేపల్లి నాగరాజు, విశ్వనాథరాజు, భాస్కరరావు, దొంగ భారతి, నాగలక్ష్మి, మండల యవత నాయకులు అశోక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడం.. దాచుకోవడమే వైసీపీ లక్ష్యం



బాబ్జికి హారతులిస్తున్న మహిళలు

పెంటపాడు, జనవరి 31: దోచుకోవడం.. దాచుకోవడమే వైసీపీ లక్ష్యమని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విమర్శించారు. బుధవారం ఆకుతీగపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి వైసీపీ అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వైసీపీ విధానాలు భరించలేక ఎప్పుడు చంద్రబాబు సీఎంగా వస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. దాసరి అప్పన్న, బుద్దన ధనరాజు, పీతల సత్యనారాయణ, కొల్లూరి నాగరాజు, పడాల ఉమాశంకర్, ముప్పిడి రమేష్, అచ్యుత సత్యనారాయణ, కొండపల్లి చినశ్రీను పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి స్వర్ణయుగం

గణపవరం : రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలోనే సాధ్యమవుతుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. అప్పన్నపేట, మల్లపురాజుపేట గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకకాలను ప్రజలకు వివరించారు. యాళ్ల సుబ్బారావు, కల్యాణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధరల బాదుడుతో సామాన్యుడు విలవిల: ఆరిమిల్లి

అత్తిలి : వైసీపీ ధరల బాదుడుతో ప్రజలు విలవిల్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా అత్తిలిలో మట్టపర్తిగరువు, చినపేట, వైఎస్ఆర్ నగర్, సీతానగరం, లక్ష్మీనగర్‌లో ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధిని, అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు అనాల ఆదినారాయణ, అత్తిలి ఏఎంసీ మాజీ ఛైర్మన్లు పోలిశెట్టి చంటి, దాసం బాబ్జీ, అత్తిలి మండల తెలుగు యువత అధ్యక్షులు పోలిశెట్టి చందు, కొరిపల్లి హరి, ఆల్తి అజయ్‌కుమార్, కడలి రామాంజనేయులు, అద్దాల సాయిబాబా, పోలవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్‌కు చెంపపెట్టు

» అభివృద్ధిపై ముదునూరి శ్వేతపత్రం విడుదల చేయాలి : టీడీపీ డిమాండ్



మాట్లాడుతున్న పొత్తూరి, కొవ్వలినాయుడు

నరసాపురం, జనవరి 31: ఇన్నర్ రింగురోడ్డుపై సుప్రీం కోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టని నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టు తీర్పులొస్తే ముఖ్యమంత్రులు రాజీనామా చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. మొద్దుబారిన ఈ జగన్ ప్రభుత్వానికి ఎన్ని తీర్పులొచ్చినా.. చీమకుట్టినట్లయినా లేకపోవడం సిగ్గుచేటన్నారు. నరసాపురం టీడీపీకి కంచుకోటని కచ్చితంగా టిక్కెట్ టీడీపీకే దక్కుతుందని.. పొత్తులో ఎవరికి వచ్చినా... గెలుపు కోసం పని చేస్తామన్నారు. కొవ్వలి నాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ముదునూరి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జక్కం శ్రీమన్నారా యణ, వాతాడి ఉమా, కోరాడ పాపారావు, ఆందే రామకృష్ణ, వైఎస్ నాగేశ్వరారావు, కాశీ, సంకు భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం జనసేన, టీడీపీని ఎన్నుకోవాలి



భీమవరం 30వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

భీమవరం జనవరి 31: . అభివృద్ధి కోసం జనసేన -టీడీపీ కూటమిని ప్రజలు ఎన్నుకోవాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు అన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు ఆదేశాల మేరకు 30వ వార్డులో జనసేన, టీడీపీ నాయకులు కలిసి 'ఇంటింటికి జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. జై శివ, మన్యం ఆంజనేయులు, ఆరేపల్లి సాయిరాం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. రామాయణం శ్రీనివాస్, పంతం సతీశ్, కటికల పల్లారావు, మాగాపు ప్రసాద్, ఆకుల శ్రీను, లక్కోజు నాని తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నిత్యం దళితులపై దాడులు

యలమంచిలి, జనవరి 31: జగన్ పాలనలో రాష్ట్రంలో నిత్యం దళితులపై దాడులు జరుగుతున్నాయని పెదలంక సర్పంచ్ తాళ్ల నాగరాజు విమర్శించారు. మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాల్లోని దళితవాడల్లో టీడీపీ, జనసేన శ్రేణులు 'దగా పడిన దళితజాతి కార్యక్రమం' బుధవారం నిర్వహించారు. టీడీపీ, జనసేన శ్రేణులు ఇంటింటికీ వెళ్లి దళితుల సంక్షేమ పథకాల రద్దు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు నిర్వీర్యం అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. పులి శ్రీరామ్మూర్తి, కడలి సత్యనారాయణ, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, శ్యాంబాబు, రియా తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

» 'ఆడుదాం ఆంధ్రా' నిధుల కేటాయింపుపై వీసీ ధ్వజం



మాట్లాడుతున్న వీసీ, కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) చైర్‌పర్సన్ వెంకటరమణ

నరసాపురం టౌన్, జనవరి 31: ఆడుదాం ఆంధ్రాకు ప్రభుత్వం నిధులు కేటాయించినా.. మునిసిపల్ జనరల్ ఫండ్ నిధులు ఎందుకు వెచ్చించారంటూ మునిసిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, టీడీపీ సభ్యులు పాలూరి బాబ్జీ, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్ నిలదీశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ వార్డుల్లో జరిగే పనులకు నిధులు లేవంటారు. గత ఏడాది కుర్చీలు, టెంట్‌లు, మైక్‌లకు రూ.25 లక్షలు ఖర్చు అయిందని అజెండాలో చూపించారు. వీటికి ఇంత ఖర్చు అవుతుందా? అంటూ నిలదీశారు. దీనికి కమిషనర్ వెంకటేశ్వరావు స్పందిస్తూ ప్రభుత్వం నుంచి నిధులు రాగానే జనరల్ ఫండ్‌లో జమ చేస్తామన్నారు. టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ మాట్లాడుతూ మునిసిపల్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని సమగ్ర విచారణ చేయాలని కమిషనర్‌ను కోరారు. మునిసిపాల్టీలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని వైసీపీ కౌన్సిలర్ వన్నెంరెడ్డి శ్రీనివాస్ నిలదీశారు. కమిషనర్ వివరణ ఇస్తూ పని చేయని కాంట్రాక్టులను కౌన్సిల్ అనుమతితో బ్లాక్‌లిస్టులో పెడతామన్నారు. మరో వీసీ కామన నాగిని మాట్లాడుతూ కమిషనర్ రూమ్‌లోంచి ఫైల్స్ బయటకు వెళ్లుతున్నా ఎందుకు చర్యలు తీసుకోరంటూ ప్రశ్నించారు. వన్నెంరెడ్డి శ్రీనివాస్, జనసేన కౌన్సిలర్లు బొమ్మిడి సూర్యకుమారి, భరత్ సురేష్, టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ మాట్లాడుతూ మా వార్డుల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదంటూ మండిపడ్డారు. దీనికి కో-ఆప్షన్ సభ్యులు వైకేఎస్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు జరిగాయంటూ ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు.

'ముదునూరు' చెప్పేవన్నీ అబద్ధాలే

» వియ్యర్ చానల్, మోడి వంతెన వద్ద బండారు ఆందోళన



మోడి వంతెన ప్రాంతంలో ఆందోళన చేస్తున్న బండారు, టీడీపీ, జనసేన శ్రేణులు

మొగల్తూరు, జనవరి 31 : ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆయన మాటలు నమ్మవద్దంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొగల్తూరులో అసంపూర్తిగా మిగిలిన వియ్యర్ చానల్, మోడి వంతెన పనులు చేపట్టాలంటూ పనుల వద్ద జనసేన, టీడీపీ శ్రేణులతో కలిసి ఆందోళనకు దిగారు. బండారు మాట్లాడుతూ వియ్యర్ చానల్ పనులకు ప్రభుత్వం రూ.24 కోట్లు కేటయించి 14 నెలల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభించలేదు. మోడి వంతెనకు గత టీడీపీ హయాంలో రూ.10 కోట్లు కేటాయించి, నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ పనులను వైసీపీ అసమర్థ ప్రభుత్వం పనులు చేపట్టలేకపోయింది. నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని ముదునూరి గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప శంకుస్థాపన చేసిన పనులు మాత్రం శిలాఫలకాలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. తొలుత గ్రామానికి విచ్చేసిన బండారుకు మహిళలు హారతులతో స్వాగతం పలికి పలు సమస్యలు వివరించారు. ఆందోళనలో మాజీ వైస్ ఎంపీపీ అంద్రాజు రామన్న, బస్వాని ఏడుకొండలు, దాసరి లక్ష్మణరావు, చంపాటి సత్యనారాయణరాజు, యినుకొండ కాశీ, కొట్టు పండు, చంపాటి సత్యనారాయణరాజు, ప్రభుదాస్, డీఎస్, నిప్పులేటి బోస్, బొక్కా చక్రవర్తి, మారెళ్ళ సుబ్బారావు, దాసరి నాగరాజు టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో జీఆర్ఈ పరీక్షాకేంద్రం

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 31 :భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జీఆర్ఈ పరీక్షాకేంద్రం ఏర్పాటుకు ఈటీఎస్ ఇండియాతో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎంఓయూ కుదుర్చుకుంది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈమేరకు కళాశాల సెక్రటరీ ఎస్ఆర్‌కే నిశాంతవర్మ, ఈటీఎస్ ప్రతినిధులు లీజో ఓమెన్, కార్తీక్ శేఖరన్ ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో జీఆర్ఈ పరీక్ష కేంద్రం వల్ల విద్యార్థులకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. సెక్రటరీ ఎస్ఆర్‌కే నిశాంత్‌వర్మ మాట్లాడుతూ ఈటీఎస్ ఒక గ్లోబల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ అన్నారు. కళాశాల కార్పొరేట్ వ్యవహారాల రిలేషన్స్ మేనేజర్ జీవీ అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో కొనసాగుతున్న పారిశుధ్య పనులు

ఆచంట, జనవరి 31: ఆచంటలో ఇటీవల ఒక యువకుడు డెంగీ వ్యాధితో మృతి చెందడంతో గ్రామంలో నిరంతరం పారిశుధ్య పనులు శానిటేషన్ పనులు మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. బుధవారం పలు ఇళ్లల్లో కూడా దోమల మందు పిచికారీ చేసి మురుగు డ్రెయిన్‌లలో ఆయిల్ బాల్స్ వదిలారు. ఈవోపీఆర్‌డీ మర్తిత బాబు, కార్యదర్శి నాగబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన అమానుషం'

అత్తిలి, జనవరి 31 :బల్లిపాడు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం అమానుషమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. బల్లిపాడులో బాధిత విద్యార్థినుల తల్లిదండ్రులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలన్నారు. తెలుగు మహిళా నాయకులు ఎం.కృష్ణకుమారి, మంగతాయారు, చల్లా పద్మావతి, వల్లూరి మాధవి, రమణమ్మ, చిట్టాల పార్వతి, రాచపూడి సత్యవతి, ఎం.మణి తదితరులు పాల్గొన్నారు.

3న ముసలమ్మ తల్లి జాతర

పెనుగొండ, జనవరి 31 : సిద్ధాంతం రజకుల వీధిలో శ్రీముసలమ్మ తల్లి జాతర ప్రారంభమైంది. రజకులు బల్లల పూజలు సందర్భంగా మూడేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర ఫిబ్రవరి 3న ఏర్పాటు చేశామని ఉత్సవ నిర్వాహకులు, రజక సంఘం పెద్దలు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారికి వెండి తొడుగు, శూలం, ఖడ్గం విఘ్నేశ్వరస్వామికి వెండి తొడుగు భక్తులు బహూకరించగా ఉత్సవాలకు పందిరి రాట వేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నిలబెట్టి గ్రామంలో ఉత్సవాలు ప్రారంభించారు. 3న జాతరలో ప్రత్యేక ఆకర్షణగా మార్టేరు ఏసు ట్రూపు గరగల నృత్యాలు, జగన్నాధపురం వారి కాళికా నృత్య ప్రదర్శన, ముక్తేశ్వర వారి కేరళ చండామేళ ప్రదర్శన ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఏడో తేదీన ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సంఘ పెద్దలు తెలిపారు.

'యద్దనపూడి' సేవలు చిరస్మరణీయం



విలేకర్లను సత్కరిస్తున్న యద్దనపూడి కుటుంబీకులు

తాడేపల్లి గూడెం అర్బన్, జనవరి 31: పాత్రికేయుడిగా, సామాజిక కార్యకర్తగా, కళాసేవకుడిగా యద్దనపూడి సూర్యనారాయణమూర్తి సేవలు చిరస్మరణీయమని రంగస్థల, కళాపరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్ కొనియాడారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో యద్దనపూడి సూర్యనారాయణమూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగసురేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బుట్టాయిగూడెం విలేకరి మామిడిశెట్టి శ్రీరాంప్రసాద్‌కు యద్దనపూడి జ్ఞాపిక, నూతన వస్త్రాలతో పాటు రూ. 5,116 నగదు పురస్కారాన్ని అందజేశారు. విలేకర్లు పీవీపీ ప్రసాద్, వి.నాగేశ్వరలింగమూర్తి, ఐతా సురేష్‌ను సత్కరించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు చింతకాయల బాబూరావు, ఓసూరి వీర్రాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు జీవీఎస్ఎన్ రాజు, గజపతి ప్రసాద్, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో వైసీపీ మోసం : పితాని



కరుగోరుమిల్లి పాదయాత్రలో మాజీ మంత్రి పితాని

ఆచంట, జనవరి 31: వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ విమర్శించారు. 'ప్రజల వద్దకు పితాని పాదయాత్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం కరుగోరుమిల్లి, కందరవల్లిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి దమ్ము ధైర్యం ఉంటే ప్రజల్లోకి వెళ్ళి ఓట్లు అడగాలన్నారు. వైసీపీ ప్రభుత్వపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉన్న కారణంగానే తాను ఏ గ్రామానికి వెళ్ళినా మహిళలు, ప్రజలు యువకులు పెద్దఎత్తున నీరాజనాలు పలుకుతున్నారన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ అల్లం పద్మావతి, బోడపాటి దుర్గా ప్రసాద్, ఉంగరాల లక్ష్మణ్, బోడపాటి గణపతి, అల్లం సూర్యప్రకాష్, జవ్వాది బాలాజీ, వై.నాగరాజు తదితరులు ఉన్నారు.

జంతువులను ఆదరించాలి : జేడీ మురళీకృష్ణ

భీమవరం టౌన్, జనవరి 31 :జంతువులను ఆదరించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. పశు సంవర్ధక శాఖ కేంద్రంలో జాతీయ జంతు పరిరక్షణ పక్షోవాల ముగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఏడీ ఎ.సత్యనారయణ మాట్లాడుతూ చెట్లు నరికివేత వల్ల మూగజీవాలకు రక్షణ లేకుండా పోతుందన్నారు.నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. లయన్స్ జోన్ ఛైర్మన్ నందమూరి రాజేష్, ఎస్‌కే చాన్ బాషా, సుంకర దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

వంటా-వార్పుతో న్యాయవాదుల నిరసన



వంట చేస్తూ నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నరసాపురం టౌన్, జనవరి 31 : వైసీపీ ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలంటూ బుధవారం న్యాయ వాదులు విధులు బహిష్కరించి, వాంటా-వార్పుతో నిరసన తెలిపారు. తొలుత కోర్టు గేటు వద్దకొద్దిసేపు ఆందోళన చేసి, చట్టాన్ని రద్దు చేయా లంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రాంగణంలో వంటలు వండి అక్కడే తిని నిరసన తెలిపారు. ఈ చట్టాన్ని రద్దు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చల్లా దానయ్యనాయుడు, ఆర్‌కే కుమార్, రఘురాం, కె.రమేష్, సి.బాలాజీ, కె.మూర్తి, ఎస్.ఆనందబాబు, జెర్సికళ, అమరేశ్వరావు, క్రాంతికుమార్, సుభాష్‌బాబు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియుల రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే నిమ్మల



బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, జనవరి 31: పాలకొల్లులో తన విజయానికి ఎల్లప్పుడూ అండగా, తోడుగా ఉండే అగ్నికుల క్షత్రియుల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. గంగడపాలెం పంట కాల్వపై రూ.12లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏట్టిగట్టుపై నివాసం ఉంటున్న కుటుంబాల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు చిన్నపాటి పంటుపై కాల్వ దాటి వెళుతున్నారని ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణంతో వారికి ఆ కష్టాలు ఇక ఉండ వన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎంపీ రఘురామకృష్ణంరాజు నిధులతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామ సర్పంచ్ మల్లాడి ఉమామహేశ్వరి మాట్లాడుతూ కాల్వపై ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ నిధులను తీసుకువచ్చిన ఎమ్మెల్యే నిమ్మలకు రుణపడి ఉంటా మన్నారు. మామిడిశెట్టి పెద్దిరాజు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, బోనం నాని, బొప్పన హరికిషోర్, రుద్రరాజు సత్యనారాయణరాజు, మల్లాడి ధర్మరాజు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం జరిగేలా చూస్తా..

పాలకొల్లు టౌన్, జనవరి 31 : రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వేలాదిమందికి ఉద్యోగ భద్రతతో పాటు పనిని తగ్గ వేతనం ఇవ్వాలని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. బుధవారం నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యే రామానాయుడుని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో న్యాయం జరిగేలా చూసే బాధ్యత తీసుకుంటానని నిమ్మల భరోసా ఇచ్చారు.

రిటైర్డ్ పోలీస్ సిబ్బందికి ఎస్పీ సత్కారం



పోలీస్ సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ

భీమవరం క్రైం, జనవరి 31 :దాదాపు 35 నుంచి 40 ఏళ్ల పాటు అంకిత భావంతో పోలీస్‌శాఖకు అందించిన సేవలు శాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాశ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ జేవీఎస్ సాయిబాబా, ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు, ఏఎస్ఐ కె.జిలాని, హెచ్‌సీ వి.సత్యనారాయ ణలను జిల్లా ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వహించినందుకు పోలీస్‌శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.భీమారావు, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులు

భీమవరం క్రైం/నరసాపురం రూరల్, జనవరి 31 : వీధి బాలల దినోత్సవం ప్రాథమిక లక్ష్యం యువత ను అత్యవసర సహాయం, ఆహారం, దుస్తులు, నివాసం, విద్య కోసం పనిచేయడ మేనని ప్యానల్ లాయర్ అంబేడ్కర్ అన్నారు. మూడో అదనపు జిల్లా జడ్జి భీమవ రం ఆదేశాల మేరకు భీమవరం తాడేరు ఇందిరమ్మకాలనీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో బుధవారం న్యాయ విజ్ఞాన సదుస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం జనవరి 31న జరుపుకోవడం ప్రతీ ఏటా జరుగుతుందన్నా రు. హెచ్ఎం పి.రంగనాథ్, విద్యా కమిటీ చైర్మన్ మహేశ్వరి మావుళ్ళు, సీఆర్పీ నాగలక్ష్మి, సచివాలయం మహిళా పోలీస్ సోనీరాణి, పారా లీగల్ కమల్‌రాజ్ పాల్గొన్నారు. నరసాపురం మండలం కొత్త నవరసపురంలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీధి బాలల దినోత్సవంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు మాట్లాడారు.

సంక్షిప్త సమాచారం..

- గణపవరం, జనవరి 31: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ చేస్తున్న భారత్ జోడో న్యాయ యాత్ర కాన్వాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అని పిప్పర పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు ఖండించారు.
- ఇరగవరం : మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాస్‌ను తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.
- పాలకొల్లు టౌన్ : కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులను ఈ పథకాల్లో చేర్పించడమే వికసిత భారత్ సంకల్పయాత్ర లక్ష్యం అని పాలకొల్లులో బీజేపీ కృష్ణా జిల్లా ఇన్‌చార్జి ఉన్నమట్ల కబర్ధి అన్నారు.
- భీమవరం క్రైం : రైలు ప్రయాణికులు రైలు ఎక్కేటప్పుడు, దిగినప్పుడు విలువైన వస్తువులను జాగ్రత్తపర్చుకుని అపరిచిత వ్యక్తుల పట్ల అవగాహన కలిగి ఉండాలని భీమవరం జంక్షన్ రైల్వేస్టేషన్‌లోని అవగాహన కార్యక్రమంలో భీమవరం గవర్నమెంట్ రైల్వే ఎస్ఐ పీటీవీ రమణ తెలిపారు.
- ఆచంట : తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆసరా ఉత్సవాల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు ఎమ్మెల్యే శ్రీరంగనాదరాజు భోజనాలు పెట్టి చీరలు అందించి సత్కరించారు.
- పోడూరు : ఎన్నికలు సమీపిస్తున్నందున పోడూరు సచివాలయం వద్ద తహసీల్దార్ ఆర్వీకృష్ణారావు పర్యవేక్షణలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.
- ఉండి : భీమవరం డీఎన్ఆర్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీల్లో పాలకొల్లు జట్టుపై ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం జట్టు విజయం సాధించింది. వీరిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ అభినందించారు.